మానకొండూర్ హస్తగతం

- ప్రతి రౌండ్‌లోనూ ముందంజ
- ఒకే రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయికి 10 ఓట్ల ఆధిక్యత
- మూడోస్థానంలో ఆరెపల్లి మోహన్


నాయకులు, కార్యకర్తలతో సంబరాల్లో పాల్గొన్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యేగా రెండు సార్లు పోటీ చేసి ఓడిన కవ్వంపల్లి సత్యనారాయణ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ప్రతి రౌండ్‌లోను హస్తం హవా కొనసాగింది. కవ్వంపల్లిపై బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ ఒక్క రౌండ్ మినహా ప్రతి రౌండ్‌లోనూ వెనుకంజలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ అనుకున్నంత ఓట్లు సాధించలేకపోయారు. 2009లో ప్రజారాజ్యం, 2014లో టీడీపీ తరుపున పోటీ చేసిన ఓడిన కవ్వంపల్లి అప్పుడు తనపై గెలుపొందిన ఆరెపల్లి మోహన్, రసమయి బాలకిషన్‌పై పైచేయి సాధించి మానకొండూర్ గడ్డను కవ్వంపల్లి అడ్డగా మార్చుకున్నారు. రసమయి బాలకిషన్‌పై 32,365 మెజార్టీతో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లు చీల్చే అవకాశం ఉందని, బీఆర్ఎస్ గెలుస్తుందని భావించిన బీఆర్ఎస్ నేతల ఆశలు ఆవిరయ్యాయి. ఆరెపల్లి మోహన్‌కు 14,879 ఓట్లు వచ్చాయి. 22వ రౌండ్‌లో కవ్వంపల్లి సత్యనారాయణ కంటే రసమయి బాలకిషన్‌కు పది ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ కవ్వంపల్లి సత్తా చాటారు. కాంగ్రెస్ 869, బీఆర్ఎస్ 247, ఆరెపల్లి కి 205 ఓట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌కు జై కొట్టిన గన్నేరువరం

గన్నేరువరం: అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కంచుకోటగా మారిన గన్నేరువరం మండలం అందరు ఊహించినట్లు గానే భారీ మెజార్టీ సాధించింది. మూడు బూత్‌లు మినహా ప్రతి బూత్‌లో ఆధిక్యం సాధించింది. మండలంలో పోలైన ఓట్లల్లో సగం ఓట్లు కాంగ్రెస్ దక్కించుకోగా, మిగతా ఓట్లు ఇతరులు పంచుకున్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలో 17,920 ఓటర్లు ఉండగా, 15,057 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 29 పోలింగ్ బూత్‌లు ఉండగా గోపాల్‌పూర్‌లోని 202 బూత్, జంగపల్లిలోని 204 బూత్, గునుకుల కొండాపూర్‌లోని 245 బూత్‌లో బీఆర్ఎస్ అధిక్యం సాధించింది. మిగిలిన 26 బూత్‌ల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరించింది. దీంతో గన్నేరువరం మండలంలో కాంగ్రెస్ పార్టీ 7,634 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 5,060, బీజేపీకి 1140 ఓట్లు, ఇతరులకు మిగతా ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌కు 2574 ఓట్ల అధిక్యం సాధించింది. కాగా బీఆర్ఎస్ పార్టీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి సొంత గ్రామంలో మాదాపూర్‌లో కాంగ్రెస్ 466 ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ 389 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ లింగాల మల్లారెడ్డి గ్రామం హన్మాజిపల్లెలో కాంగ్రెస్‌కు 745 ఓట్లు, బీఆర్ఎస్ 358, బీజేపీకి 125 ఓట్లు సాధించాయి. అలాగే బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న గ్రామం ఖాసీంపేటలో సైతం కాంగ్రెస్ లీడ్ సాధించింది. కాంగ్రెస్‌కు 455 ఓట్లు రాగా బీఆర్ఎస్ 373 ఓట్లు వచ్చాయి. ఇకా బీఆర్ఎస్‌కు చెందిన వైస్ ఎంపీపీ గ్రామం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 1013 ఓట్ల అధిక్యం సాధించింది. ఇక్కడ 1970 ఓట్లు కాంగ్రెస్ సాధించగా, బీఆర్ఎస్ 957, బీజేపీ 141 ఓట్లను సాధించాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి గ్రామం చొక్కారావుపల్లెలో కాంగ్రెస్‌కు 280 ఓట్లు, బీఆర్ఎస్ 96 ఓట్లు వచ్చాయి. బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ గ్రామం ఖాసీంపేట బీజేపీకి 84 ఓట్లు మాత్రమే వచ్చాయి. సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచుల పోరం గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్లింది.

ఓటింగ్ పెంచిన ప్రత్యేక కేంద్రాలు

- మెరుగైన ఓటింగ్ శాతం నమోదు
- 112(హుజూరాబాద్)లో అత్యధికంగా 87.1పోలింగ్
- అత్యల్పంగా 126(కరీంనగర్)లో 16.37శాతం


కార్ఖానగడ్డలో మహిళా పోలింగ్ కేంద్రం

కరీంనగర్ అర్బన్: ప్రత్యేక పోలింగ్ కేంద్రాలతో ఎన్నికల సంఘం మెరుగైన ఫలితాలు పొందింది. ఓటర్లను పోలింగ్ బూత్ వైపుకు నడిపించేందుకు మహిళా, మోడల్ పోలింగ్ కేంద్రాలతో పాటు కొత్తగా దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గానూ 48 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒక్కో నియోజకవర్గంలో ఐదు మహిళా, ఐదు మోడల్, ఒక దివ్యాంగులు, ఒక యువ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 పోలింగ్ కేంద్రాల్లో 70–80శాతం పోలింగ్ నమోదు కాగా.. 21పోలింగ్ కేంద్రాల్లో 80కి పైగా పోలింగ్ శాతం నమోదైంది. ఆరుకేంద్రాల్లో 60–70శాతం పోలింగ్ నమోదవగా ఒక కేంద్రంలో 16.37శాతం పోలింగ్ నమోదైంది. మానకొండూరు నియోజకవర్గంలోని ప్రత్యేక కేంద్రాల్లో ఒక కేంద్రం మినహా 11 కేంద్రాల్లో 80శాతానికి పైగా పోలింగ్ నమోదవడం స్వాగతించదగ్గ పరిణామం.

మహిళా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళి ఇలా..

- కరీంనగర్ నియోజకవర్గంలోని 36 రేకుర్తి కేంద్రంలో 1,479 మంది ఓటర్లకు 925 మంది ఓటేశారు. ఇందులో 474మంది మహిళలు ఉండగా.. 62.54శాతం ఓటింగ్ నమోదైంది. 68 తీగలగుట్టపల్లిలో 1504 మంది ఓటర్లకు 1,065మంది ఓటేశారు. ఇందులో 509మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొనగా.. 70.81శాతం పోలింగ్ నమోదైంది. గుంటూరుపల్లి కేంద్రంలో 904 మంది ఓటర్లు ఉండగా.. 148 మందే ఓటేశారు. ఇందులో 114మంది మహిళలు ఉన్నారు. 16.37శాతం పోలింగ్ నమోదైంది. 252 కార్ఖానగడ్డలో 1,342మంది ఓటర్లు ఉండగా.. 868 మంది ఓటేశారు. వీరిలో 463మంది మహిళలు ఉన్నారు. 64.68శాతం పోలింగ్ నమోదైంది. 292రాంపూర్‌లో 1,484 ఓటర్లకు 482 మంది మహిళలు ఓటేశారు.
- హుజూరాబాద్ నియోజకవర్గంలో 43 హుజూరాబాద్‌లో 485మంది ఓటర్లు ఉండగా.. 325మంది ఓటేశారు. వీరిలో 169మంది మహిళలు ఉండగా 67.0శాతం ఓటింగ్ నమోదైంది. 112నర్సింగాపూర్ బూత్‌లో 638మంది ఓటర్లు ఉండగా 556మంది ఓటేశారు. వీరిలో 293మంది మహిళలు ఉన్నారు. 87.10శాతం పోలింగ్ నమోదైంది. 177 జమ్మికుంటలో 838మంది ఓటర్లు ఉన్నారు. 555మంది ఓటేశారు. వీరిలో 291మంది మహిళలు ఉండగా 66.20శాతం ఓటింగ్ అయ్యింది. 226 శ్రీరాములపల్లిలో 629మందికి 541మంది ఓటేశారు. వీరిలో 271 మంది మహిళలు ఉండగా.. 86.0శాతం పోలింగ్ రికార్డయ్యింది. 268కమలాపూర్‌లో 874మందికి 368 మంది ఓటేశారు.
- మానకొండూర్ నియోజకవర్గంలోని 10మానకొండూరు బూత్‌లో 665 మంది ఓటర్లకు 544మంది ఓటేశారు. 81.80శాతంగా నమోదైంది. 159 రామకృష్ణాకాలనీలో 1067 మంది ఓటర్లకు 821 మంది ఓటేశారు. 76.94శాతంగా పోలింగ్ పోలింగ్ నమోదైంది. 192 పర్లపల్లిలో 957మందికి 812 మంది ఓటేశారు. 84.85శాతం ఓటింగ్ నమోదైంది. 108జంగపల్లిలో 844కు 658మంది, 215 కొత్తగట్టులో 712కి 619మంది ఓటేశారు.
- చొప్పదండి నియోజకవర్గంలోని 29గంగాధరలో 721మందికి 472, 84 రామడుగులో 740కు 532మంది ఓటేశారు. 175 రుక్మాపూర్‌లో 635మందికి 502 మంది ఓటేశారు. 188 బూరుగుపల్లిలో 371మందికి 293 మంది ఓటేశారు. 250 కొడిమ్యాలలో 690 మందికి 486 మంది ఓటేయ్యగా.. 70.43శాతం పోలింగ్ నమోదైంది.

మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఇలా

పోలింగ్‌కేంద్రం	మొత్తంఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
50 కొత్తపల్లి	1092	859	414	445	78.66
62 ఆరెపల్లి	790	583	299	284	73.8
84 ఫకీర్‌పేట	544	449	239	219	82.54
284 కరీంనగర్	958	559	272	287	58.35
3 నాగుల మల్యాల	1035	861	427	434	83.19
4 చెల్పూరు	631	511	258	253	81.0
104 వీణవంక	1096	904	426	478	82.5
171 జమ్మికుంట	814	590	302	288	72.5
225 ఇల్లందకుంట	1,184	1,004	486	518	84.8
265 కమలాపూర్	1014	796	394	402	78.5
8 మానకొండూరు	706	574	284	290	81.3
184 పర్లపల్లి	994	816	422	394	82.09
205 జంగపల్లి	1090	916	466	450	84.04
85 కొత్తగట్టు	588	489	248	241	83.16
222 బెజ్జంకి	701	566	286	280	80.74
26 గంగాధర	643	492	219	273	76.52
86 రామడుగు	1065	805	383	422	75.52
156 గాంధీనగర్	653	516	251	265	79.02
204 వెంకట్రామ్‌పల్లి	1040	857	408	449	82.40
256 కొడిమ్యాల	794	606	273	333	76.32

దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల్లో ఇలా

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
2 విద్యానగర్	544	414	198	216	76.1
35 హుజూరాబాద్	556	439	215	224	79.0
150 పోరండ	1004	877	429	448	87.35
126 దేశాయ్‌పేట	800	681	327	354	85.13

యువ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఇలా

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	పురుషులు	మహిళలు	శాతం
27 చింతకుంట	1279	921	473	448	72.01
31 హుజూరాబాద్	711	572	272	300	80.5
18 ముంజంపల్లి	1,046	896	453	443	85.66
67 గోపాల్‌రావుపేట	1,059	762	379	383	71.95


చిగురుమామిడిలో శ్రీకాంతాచారి వర్ధంతి


వర్ధంతి నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో అమరుడైన శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. ఆదివారం గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం మండలశాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీకాంతాచారి విగ్రహాన్ని ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు సదాచారి, నాయకులు వెంకటరమణ, సదాచారి, చిరంజీవి, వెంకటచారి, రాజయ్య, సాంబయ్య, పాల్గొన్నారు.

వీళ్లు మనోళ్లే..

వర్ధన్నపేట ఎమ్మెల్యే జమ్మికుంటవాసే


కేఆర్ నాగరాజు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన కేఆర్ నాగరాజు వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందాడు. నాగరాజు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఐ మొదలుకొని సీపీ స్థాయివరకు విధులు నిర్వహించి రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. అనంతరం వరంగల్ పట్టణంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాగరాజు గెలుపుపై దొగ్గల భాస్కర్, కిషన్‌రావు, బోయిని అంకూస్, ధర్మయ్య, సంజీవ్, నాగరాజు శ్రీను, సంపత్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వెదిర గ్రామస్తుల శుభాకాంక్షలు


మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

రామడుగు: మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన ప్రేమ్‌సాగర్‌రావు అత్తగారి ఊరు మండలంలోని వెదిర గ్రామం కావడంతో గ్రామస్తులు సోషల్‌మీడియా ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గ్రామానికి చెందిన కిషన్‌రావు–సావిత్రి కూతురు సురేఖను వివాహం చేసుకున్నారు. ప్రేమ్‌సాగర్‌రావు గెలుపుపై అత్తమామలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్సీగా పని చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం


కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

తిమ్మాపూర్: మానకొండూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడంతో పార్టీ శ్రేణులు ఎల్ఎండీ కాలనీలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వద్ద కాంగ్రెస్ జెండాలతో వచ్చి టపాసులు పేల్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు అక్కడికి చేరుకొని బాణాసంచా పేల్చడం వివాదానికి దారి తీసినట్టు తెలిసింది. ఎల్ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు పార్టీల నాయకులకు సర్దిచెప్పారు.

విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. శంషాబాద్ గ్రామంలో విద్యుత్ లైన్‌ల కింద చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘పాడి’కి జైకొట్టిన హుజూరాబాద్

- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఈటల రాజేందర్, వొడితెల ప్రణవ్


జమ్మికుంటలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: హుజూరాబాద్ బరిలో కౌశిక్‌రెడ్డి గెలుపొందగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ద్వితీయ స్థానం, కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ మూడో స్థానంలో నిలిచారు. కౌశిక్‌రెడ్డి ఈటపై 16,873 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 22 రౌండ్లలో కౌశిక్ రెడ్డి 80,003 ఓట్లు సాధించారు. పోస్టల్ బ్యాలెట్లు 330 కలుపుకొని 80, 333 ఓట్లు వచ్చాయి. ఈటల రాజేందర్ 62,845 ఓట్లు రాగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 615 కలిపి 63,460 ఓట్లు వచ్చాయి. వొడితెల ప్రణవ్ 52,461 ఓట్లు రాగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 703 కలిపి 53,164 ఓట్లు వచ్చాయి.

హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా కౌశిక్‌రెడ్డి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించినంతరం నాయకులు, కార్యకర్తలతో సంబరాల్లో పాల్గొన్నారు. నమ్మకంతో ఓటేసిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈటల కోటకు బీటలు

రెండు దశాబ్దాల పాటు ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకున్నాడు. కాగా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఈటల కోటను బద్దలు కొట్టి విజయం సాధించారు. ఈటల ఓటమే లక్ష్యంగా కౌశిక్ రెడ్డి ఒక పథకం ప్రకారం ఈటలను ఓడించి ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన సత్తా చాటాడు. కౌశిక్‌రెడ్డి మూడు సంవత్సరాలుగా గ్రామాల్లో క్యాడర్‌ను పెంచుకొని వ్యూహంతో ముందుకు సాగి ఈటలపై ఘనవిజయం సాధించారు.

అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు నివాళి

జమ్మికుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కౌశిక్‌రెడ్డి ఆదివారం రాత్రి జమ్మికుంటకు చేరుకొని పట్టణంలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోట, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణం, మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులుసంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, కౌశిక్‌రెడ్డి పట్టుదలతో విజయం చేకూరిందన్నారు.

కౌశిక్‌రెడ్డి స్వగ్రామంలో బీఆర్ఎస్ హవా

వీణవంక: అసెంబ్లీ ఎన్నికలల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సొంత గ్రామం వీణవంకలో పట్టు సాధించారు. బీఆర్ఎస్ 1,929, బీజేపీకి 678, కాంగ్రెస్ 236 ఓట్లు సాధించాయి. బీఆర్ఎస్‌కు 1,251ఓట్ల అధిక్యం వచ్చింది. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ స్వగ్రామం హిమ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి 11 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్ 337, బీఆర్ఎస్ 326, బీజేపీకి 319 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో గెల్లు శ్రీనివాస్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయగా బీజేపీ 199ఓట్ల మెజార్టీ సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ స్వగ్రామం హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో సత్తా చాటాడు. కాంగ్రెస్ 1,133, బీఆర్ఎస్ 376, బీజేపీకి 279 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రణవ్‌కు 757ఓట్ల మెజార్టీ సాధించి పట్టు నిలుపుకున్నాడు. వీణవంక మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా కౌశిక్‌రెడ్డికి 10వేల పైచిలుకు మెజార్టీ వచ్చింది. చల్లూరులో బీఆర్ఎస్‌కు అత్యధికంగా 700 ఓట్ల మెజార్టీ వచ్చింది. కానీ ప్రణవ్ స్వంత మండలం హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ ఆధిక్యం కనబర్చింది.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


శంకరపట్నంలో నాయకుల సంబరాలు


చిగురుమామిడిలో...

సైదాపూర్: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గెలవడంతో ఆదివారం మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో అమ్మనగుర్తి ఎంపీటీసీ లంకదాసరి అరుణమల్లయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, గోపగాని నవీన్,పూసాల ఆంజనేయులు, అనగోని శ్రీనివాస్, గొల్లపల్లి యాదగిరి, ముదిరాజు నాయకుడు నెల్లి రాములు, అనగోని సచిన్, సీనియర్ నాయకుడు గాదపాక కొమురయ్య, రామ్మూర్తి, దాసరి సందీప్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. మినీ బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ గీకురు రవీందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్‌కుమార్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక మొదటిసారి అల్గునూరు చేరుకోవడంతో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంబరాల్లో పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలుపొందడంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. చొప్పదండి పట్టణ శాఖ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, మంగళపల్లి గ్రామంలో వెల్మ ఎవన్ రెడ్డి ఆధ్వర్యంలో పటాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. ర్యాలీగా తరలివెళ్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 25 ఏళ్ల తర్వాత చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి గెలవడంతో కార్యకర్తలు నృత్యాలు చేస్తూ అలరించారు.


సైదాపూర్ మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బీఆర్ఎస్ కంచుకోటకు బీటలు

- చొప్పదండిలో కాంగ్రెస్ జెండా
- ప్రతి రౌండ్‌లో ఆధిక్యం
- ప్రభావం చూపని బీజేపీ అభ్యర్థి



చొప్పదండి: దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ కంచుకోటగా నిలిచిన చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం భారీ మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 1,82,188 ఓట్లు పోలయ్యాయి. మేడిపల్లి సత్యం 90,395, బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు 52,956 ఓట్లు పోలయ్యాయి. 37,439 ఓట్ల మెజారిటీతో సత్యం గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి బొడిగె శోభ గాలన్నకు 26,669, బీఎస్పీ అభ్యర్థి కొంకటి శేఖర్ 5,153 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యత ప్రదర్శించారు. కాంగ్రెస్‌కు 638, బీజేపీకి 162, బీఆర్ఎస్‌కు 109 ఓట్లు లభించాయి. టీడీపీ కంచుకోట నుంచి బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గంపై పైచేయి సాధించగా, ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ తన ఆధిక్యత ప్రదర్శించింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 13 శాసనసభ ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ పార్టీకి ఇదే మూడో విజయం కావడం గమనార్హం.

- ఆకట్టుకున్న సైకత శిల్పం



కరీంనగర్‌కల్చరల్: మంకమ్మతోటకు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్ ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహించిన ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో మూడో రోజు ఆదివారం కోణార్క్ ఆలయ సమీపంలో గల చంద్రభాగా నదీ తీరంలో ‘మహిళా సర్వతోముఖాభివృద్ధి’ అంశంపై సైకత శిల్పాన్ని రూపొందించి అభినందనలు అందుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుందనే సందేశంతో ప్రపంచమంతా నీదే నినాదంతో మహిళా శక్తిని చాటే శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

5న గిరిజా గోశాల వార్షికోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ పంచాయతీ పరిధిలోని ఎల్ఎండీ కాలనీలోని మృత్యుంజయాలయం ఆవరణలోని గిరిజా గోశాల ఆరో వార్షికోత్సవం 5న నిర్వహించనున్నట్లు ఆలయం, ట్రస్టు నిర్వాహకులు మోహన్ రెడ్డి, లక్ష్మణరావు, బాలకిషన్ రావు తెలిపారు. అష్టమి తిథి రోజున ఉదయం తొమ్మిది గంటల నుంచి గోశాల ఫౌండర్, చైర్మన్ బ్రహ్మశ్రీ వేదమూర్తులు పురాణం మహేశ్వరశర్మ నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు గోమహాయాగం, గోవ్రతం, కార్తీక మాసం సందర్భంగా పూజలు, సామూహికంగా భక్తులతో నిర్వహిస్తామన్నారు. భక్తులు మంగళహారతి తెచ్చుకోవాలని సూచించారు. కార్తీక దామోదర పూజ, తులసీ కల్యాణం తదనంతరం కార్తీక మాస విశిష్టత, గోశాల గూర్చి పురాణం మహేశ్వరశర్మ వివరిస్తారని. మధ్యాహ్నం నుంచి కార్తీక సామూహిక వనభోజనంలుంటాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899